నోట్లే.. ఓట్లు!



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

- పోలింగ్ తేదీ దగ్గర పడ్డంతో జిల్లాలో అధికార వైసీపీకి ఓటమి జ్వరం
- కూటమి స్పీడు, తీవ్ర ప్రభుత్వ వ్యతిరేకతతో చెల్లాచెదురవుతోన్న ఓట్లు
- ఎలాగైనా గెలవాలని భారీగా నోట్లు వెదజల్లుతున్న వైనం
- రాత్రివేళల్లో గ్రామాల్లో చీరలు, గిఫ్టులు భారీగా వెదజల్లుతున్న నేతలు

అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా నాలుగురోజులే ఉండడంతో జిల్లాలో అధికార వైసీపీకి ఓటమి జ్వరం పట్టుకుంది. ఏ నియోజకవర్గంలో చూసినా పార్టీపై ఓటర్లలో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుండడంతో అనుకూల ఫలితాలపై నమ్మకం సడలుతోంది. ఒకపక్క కూటమి స్పీడు, మేనిఫెస్టో ప్రభంజనం, అటు ఫ్యాన్‌పై వ్యతిరేకతతో ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయం వెన్నాడుతోంది. దీంతో ఎక్కడికక్కడ కోట్లలో నోట్లకట్టలకు పనిచెబుతున్నారు. పిఠాపురంలో ఓటమి ఖాయమవడంతో ఏకంగా ఓటుకు రూ.4వేల చొప్పున బుధవారం నుంచి పంపకాలు ప్రారంభించారు. కాకినాడ సిటీ, కాకినాడరూరల్, పెద్దాపురంలో రూ.2వేలు, ప్రత్తిపాడు, జగ్గంపేట, తునిలో రూ.1,500 చొప్పున రేటు కట్టేశారు. ఇతర జిల్లాలనుంచి వచ్చిన రహస్య బృందాలతో డబ్బుల ఎర విసురుతున్నారు. చీరలు, వాచీలు భారీగా పంపిణీ చేస్తున్నారు. తమ ప్రలోభాలకు అడ్డం లేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు నజరానాలు ఇచ్చేశారు.

ఓటమి భయంతో అడ్డదార్లు..

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వైసీపీకి వణుకు పుట్టిస్తున్నాయి. ఏ నియోజకవర్గం చూసినా గెలుస్తామనే నమ్మకం కనిపించకపోవడంతో ఆయా అభ్యర్థులు దిక్కుతోచక విలవిల్లాడుతున్నారు. దీంతో చేసేదిలేక ప్రలోభాలనే నమ్ముకుని ముందుకు సాగుతున్నారు. ఈరకంగానైనా ఎంతోకొంత ఓట్లు సాధించేందుకు అడ్డదార్లు తొక్కుతున్నారు. వాస్తవానికి నెలకిందటి వరకు జిల్లాలో కనీసం రెండు సీట్లు అయినా గెలుస్తామని వైసీపీ అంచనా వేసింది. అటు ఇంటెలిజెన్స్ నివేదికలు కూడా గౌరవప్రదంగా ఒకటి లేదా రెండు సీట్లు రావొచ్చని ప్రభుత్వానికి రిపోర్టులు పంపింది. కానీ కూటమి స్పీడు పెంచడం, చంద్రబాబు, పవన్ పోటీపోటీగా జిల్లాను చుట్టేయడం, అటు మేనిఫెస్టో అదుర్స్ అనిపించుకోవడంతో వైసీపీకి ఎంతోకొంత ఆశగా ఉన్న సీట్లు కూడా చేజారినట్లు తాజా నివేదికలు వెళ్లాయి. దీంతో నోట్ల కట్టలకు వైసీపీ అభ్యర్థులు పని చెప్పారు. పిఠాపురంలో పవన్‌పై ఓటమి ఖాయమని అర్థమైపోయినా వైసీపీ రాక్షస ప్రయత్నం కొనసాగిస్తోంది. అందుకోసం యు.కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు రూరల్‌ప్రాంతాల్లో ఏకంగా ఓటుకు రూ.4వేల చొప్పున పంపిణీ చేస్తోంది. మత్స్యకార, ఎస్సీ గ్రామాల్లో రూ.4వేలు పంచింది. ఇతర సామాజిక వర్గాలున్న ప్రాంతాల్లో రూ.3వేల చొప్పున పంపిణీ చేస్తోంది. వైసీపీ అనుకూల గ్రామాల్లో రూ.1,500 ఇస్తోంది. ఈ ఓట్లు కూడా పవన్‌కే వెళ్తాయన్న అనుమానాలతో రూ.2వేలు కూడా ఇవ్వడానికి సిద్ధమైంది. ఒకరకంగా చెప్పాలంటే పిఠాపురంలో రూ.40కోట్ల వరకు వెదజల్లడానికి వైసీపీ అన్నిరకాలుగా మోహరించింది. కాకినాడ సిటీలో ఎమ్మెల్యే ద్వారంపూడికి ఓటమి బెంగ పట్టుకుంది. దీంతో వార్డుల్లో రూ.2వేల చొప్పున పంపిణీకి అంతా సిద్ధం చేశారు. కులసంఘాలు, ఇతర కీలకనేతలకు రూ.లక్ష చొప్పున అందిస్తున్నారు. కాకినాడరూరల్‌లో ఎమ్మెల్యే కన్నబాబు అనుచరులు చీరతోపాటు ఓటుకు రూ.1,500 చొప్పున వెదజల్లుతున్నారు. కులసంఘాలకు రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు పంచుతున్నారు. ప్రత్తిపాడులో అభ్యర్థి వరుపుల సుబ్బారావును ఎలాగైనా గట్టెక్కించడానికి ఎమ్మెల్సీ అనంతబాబు నోట్ల కట్టలనే నమ్ముకున్నారు. గ్రామాల్లో రూ.వెయ్యి, మండల కేంద్రాల్లో రూ.1,500 చొప్పున పంపిణీ చేస్తున్నారు. తుని, జగ్గంపేటలో రూ.వెయ్యి, టీడీపీకి బాగా బలమున్న ప్రాంతాల్లో రూ.2వేల చొప్పున వెదజల్లుతున్నారు. పెద్దాపురంలో వైసీపీ ఓటుకు రూ.2వేల చొప్పున గ్రామాల నుంచి పంచుకువస్తున్నారు.

నియోజకవర్గానికి 40మంది

జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని నియోజకవర్గాలకు వైసీపీ ఇతర జిల్లాల నుంచి తీసుకువచ్చిన నేతలకు డబ్బు పంపిణీ బాధ్యతలు కట్టబెట్టింది. ప్రధానంగా నెల్లూరు, రాయలసీమనుంచి కొన్ని బృందాలను దించింది. ఒక్కో నియోజకవర్గానికి 40మంది చొప్పున మనుషులను కేటాయించి డబ్బు, మందు పంపిణీ చేయిస్తోంది. వీరంతా కొన్నిరోజుల కిందట లాడ్జీలు, హోటళ్లలో దిగారు. కొన్ని నియోజకవర్గాల్లో ఏకంగా ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందికి వైసీపీ నేతలు రూ.50వేల వరకు నజరానాలు అందించారు. బుధవారం తీరప్రాంత మండలాల్లో యథేచ్ఛగా డబ్బు పంచినా కన్నెత్తి చూడకుండా దారిలోకి తెచ్చుకున్నారు.

ఊరెళ్లాలి.. ఓటెయ్యాలి!

ఓట్ల పండుగకు వస్తున్నారు..





ఊరెళ్లాలి..ఓటెయ్యాలి.. అందరి ఆశ ఇదే.. గోదావరి జిల్లా వాసులంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు.. వ్యాపారాలు.. ఉద్యోగాలు చేసుకుంటూ సుదూరంగా ఉండిపోయారు. ఒక్క మలికిపురం నియోజకవర్గం నుంచే సుమారు 6వేల మంది హైదరాబాద్‌లో ఉన్నట్టు సమాచారం.. దాదాపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని 22 నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి..అమెరికా, ఆస్ట్రేలియా, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డారు.. అయితే ఈ నెల 13వ తేదీన పోలింగ్ కావడంతో ఆయా ప్రాంతాల నుంచి తిరిగి స్వగ్రామాలకు చేరుతున్నారు. ఇప్పటికే రైళ్లు, బస్సులు, విమానాలకు రిజర్వేషన్లు ఫుల్ అయిపోయాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొంతమంది మాత్రం తమ సొంత వాహనాల్లో తరలివస్తున్నారు. ఎన్నడూ లేనిది సంక్రాంతికి పండుగకు వచ్చినట్టు ఓట్ల పండుగకు ఊరెళ్లాలి..ఓటెయ్యాలి అంటూ పెద్ద ఎత్తున పల్లెబాట పట్టారు.

- పల్లెకు పోదాం.. ఓటును వేద్దాం చలోచలో..
- తెలంగాణ నుంచి తరలివస్తున్న ఓటర్లు
- హైదరాబాద్, బెంగళూరు, చెన్నై రైళ్లకు రిజర్వేషన్లు ఫుల్
- స్వస్థలాలకు వచ్చేందుకు ఎన్‌ఆర్‌ఐల ఆసక్తి
- బస్సు చార్జీలు పెంపు
- విమాన చార్జీలూ అంతే
- పలు నియోజకవర్గాల్లో వలస ఓటర్లకు ప్రత్యేక బస్సులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)/పిఠాపురం/ముమ్మిడివరం/రాజమహేంద్రవరం అర్బన్, మే 8: అన్ని రూట్లు ఓటు వైపే వస్తున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారితో పాటు విదేశాల్లో స్థిరపడిన ప్రవాసాంధ్రులు సైతం ఓటు వేసేందుకు స్వస్థలాలకు వచ్చేస్తున్నారు. గతంలో జరిగిన ఎన్నికలతో పోల్చుకుంటే ఇలా వచ్చేవారి సంఖ్య రెండు రెట్ల కంటే అధికంగా ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే రైళ్లల్లో రిజర్వేషన్లన్నీ ఫుల్ కాగా బస్సు, విమాన టిక్కెట్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. కొన్ని అసోసియేషన్లు ఇప్పటికే ఉద్యోగుల కోసం ఉచితంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించినా అవి పూర్తిస్థాయిలో సరిపోవడం లేదు. వీటితోపాటు ప్రధాన పార్టీల అభ్యర్థులు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వలస ఓటర్లపై దృష్టిసారించి ప్రత్యేకంగా బస్సులు పురమాయిస్తున్నట్టు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారడం, ఏపీని కాపాడుకోవాలన్న లక్ష్యం ప్రతి ఒక్కరిలోనూ అధికమైన నేపథ్యంలో వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఈసారి స్వస్థలాల్లో ఓటు వేయాలనే కృతనిశ్చయానికి వచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి అత్యధికంగా హైదరాబాద్, సికింద్రాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబయి, పుణే తదితర ప్రాంతాల్లో ఎక్కువగానే ఉన్నారు. ప్రవాసాంధ్రుల ఓట్లు కూడా ఈ ఎన్నికల్లో కీలకంగా మారాయి. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఫోన్ల ద్వారా వీరిని సంప్రదించి ఓటు వేసేందుకు రావాలని కోరారు. ఇప్పటికే వీరు ఓటు వేసేందుకు స్వస్థలాలకు రావాలని నిర్ణయించుకోవడం, శని, ఆదివారాలు సెలవు కావడం, పోలింగ్ జరిగే మే 13న సెలవు ప్రకటించడంతో ఇంటికి వచ్చి మూడు రోజులు గడిపినట్టు ఉంటుందని అందరూ ప్రయాణాలకు సిద్ధమయ్యారు.

రైళ్లన్నీ ఫుల్

13న పోలింగ్ కావడంతో వచ్చే వారంలో రైళ్లలో రిజర్వేషన్లు ఇప్పటికే నిండుకున్నాయి. తెలంగాణలోని హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాజమహేంద్రవరం, సామర్లకోట, పిఠాపురం, అన్నవరం, తుని వచ్చే రైళ్లల్లో రిజర్వేషన్లు అన్నీ ఇప్పటికే ఫుల్ అయ్యాయి. చెన్నై, బెంగళూరు నుంచి వచ్చే రైళ్లల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఎన్నికల పోలింగ్ 13వ తేదీ కాగా.. 11న రెండో శనివారం, 12న ఆదివారం సెలవులు కలిసి రావడంతో సికింద్రాబాద్ నుంచి 10వ తేదీ నుంచి జిల్లాకు వచ్చే రైళ్లలో రిజర్వేషన్లు అయిపోయాయి. 10,11,12 తేదీల్లో వందే భారత్ 170, విశాఖ వందేభారత్ 133, షాలిమార్ వీక్లీ 172, షిర్డీ 120 వెయిటింగ్ లిస్ట్ ఉంది. ఉమ్మడి జిల్లావాసులు హైదరాబాద్‌కి ఎక్కువగా రాకపోకలు సాగించే గోదావరి, ఫలక్‌నుమా, గౌతమి ఎక్స్‌ప్రెస్‌ల్లో 400 వెయిటింగ్ లిస్ట్ ఉండగా.. 11, 12, గౌతమికి రిజర్వేషన్లు లేవు. కోకనాడ ఎక్స్‌ప్రెస్ వెయిటింగ్ లిస్ట్ 180 దాటింది. గరీబ్‌రథ్‌కు 10న అసలు రిజర్వేషన్లు లేవు. 11న 300, 12న 295 వెయిటింగ్ లిస్టు ఉంది. కోణార్క్‌కి 12 వరకు రిజర్వేషన్లు అయిపోయాయి.

ఎన్‌ఆర్‌ఐలు వస్తున్నారు..

ఈ సారి ఎన్నికల్లో విదేశాల్లో ఉంటున్న జిల్లాకు చెందిన వారు ఓటు వేసేందుకు ప్రత్యేకంగా స్వస్థలాలకు వస్తున్నారు. వీరు ముందుగానే టిక్కెట్లు రిజర్వ్ చేసుకుని విమానాల్లో వచ్చి ఓటు వేసి కుటుంబసభ్యులు, తల్లిదండ్రులతో వారం పది రోజులు గడిపేలా ఏర్పాట్లు చేసుకున్నారు. అమెరికా, ఇంగ్లండ్, ఐర్లాండ్, ఆస్ట్రేలియా, దుబాయ్‌తో పాటు గల్ఫ్ దేశాల నుంచి అధికంగా వస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గానికి చెందిన వారే సుమారు వెయ్యి మంది వరకూ ఓటు వేసేందుకు స్వదేశానికి వస్తున్నట్టు చెబుతున్నారు. దీంతో జిల్లాలో ఉన్న రాజమహేంద్రవరం మధురపూడి ఎయిర్‌పోర్ట్ గత వారం రోజులుగా కిటకిటలాడుతోంది. రాష్ట్రంలో గత ఐదేళ్లల్లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, సంఘటనలు అందరినీ కలచివేయడంతో పాటు ఇలాగే ఉంటే మన భావితరాల భవిష్యత్తు ఏమిటనే ఆలోచన అందరినీ ఓటు వేయాలనే సంకల్పం వైపు నడిపిస్తున్నట్టు పలువురు చెబుతున్నారు. గతంలో ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు కేవలం 20 నుంచి 40 శాతం మంది మాత్రమే వచ్చి ఓటు వేసేవారు. ఈసారి అది 80-90 శాతం వరకూ ఉంటుందని అంచనా.

ఎన్నికల కోసం ఆర్టీసీ బస్సులు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి తరలివచ్చే ఓటర్ల కోసం ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఈనెల 9వ తేదీ నుంచి సికింద్రాబాద్-హైదరాబాద్ ప్రాంతాల నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ఈ స్పెషల్ సర్వీసులు ప్రారంభమవుతున్నాయి. ముందుగా తెలంగాణ రాష్ట్రం నుంచి ఓటర్లను ఇక్కడకు తీసుకురానున్నారు. 13న పోలింగ్ ముగిసిన తర్వాత కూడా మరో రెండు, మూడు రోజులు ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ స్పెషల్ సర్వీసులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నారు. హైదరాబాద్‌కు రెగ్యులర్‌గా నడిచే సర్వీసులకు ఈ స్పెషల్ సర్వీసులు అదనం కానున్నాయి. స్పెషల్ సర్వీసులకు టిక్కెట్ ధరలు సాధారణంగానే ఉంటాయని, అదనపు చార్జీలు వసూలు చేయట్లేదని ఆర్టీసీ డీఎం షబ్నం తెలిపారు.

ప్రత్యేక బస్సుల ఏర్పాటు

వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ సహా వివిధ అసోసియేషన్లు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశాయి. పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తున్న నేపథ్యంలో ఐటీతో వివిధ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న ఉద్యోగులు తమ సొంత ఖర్చులతో కార్లు, ఇతర వాహనాలను ఓటు వేసేందుకు వచ్చే ఉద్యోగస్తుల కోసం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వీరితో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకుని సమాచారాన్ని పంచుకుంటున్నారు.

ప్రైవేటు బస్సుల చార్జీలు భారీగా పెంపు

రైళ్లల్లో రిజర్వేషన్లు ఫుల్ కావడంతో ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు బస్సు చార్జీలను భారీగా పెంచేశారు. గతంలో రూ.750 నుంచి రూ.1,000 వరకు ఉన్న చార్జీలు ఇప్పుడు రూ.2,100 నుంచి రూ.3 వేల వరకూ పెరిగాయి. ఈ ధరల్లో కూడా టిక్కెట్లు అందుబాటులో ఉండని పరిస్థితి ఉంది. హైదరాబాదు నుంచి రాజమహేంద్రవరానికి సాధారణ రోజుల్లో రూ.3,500 ఉన్న విమాన టిక్కెట్ ధర 10,11,12 తేదీల్లో బుధవారం సాయంత్రానికి రూ.7,900 నుంచి రూ.9,000 వరకూ ఉన్నాయి. ఇవి మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైళ్లు, బస్సుల్లో తిరుగు ప్రయాణానికి టిక్కెట్లు అందుబాటులో లేకపోవడంతో ఎక్కువ మంది సొంత వాహనాలపై వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. రెండు, మూడు కుటుంబాలు కలిసి ఒకే వాహనంలో వచ్చే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పోలింగ్ రోజున మాత్రం రిజర్వేషన్లు ఖాళీ ఉండడం గమనార్హం. ఉమ్మడి జిల్లాల్లోని ముఖ్యంగా సామర్లకోట, కాకినాడ, రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కి 13, 14 తేదీల్లో విపరీతమైన రద్దీ ఉంది.

కూటమి అభ్యర్థులకు గన్‌మెన్ల కేటాయింపు

సర్పవరం జంక్షన్/కాకినాడ సిటీ, మే 8: జిల్లాలోని కూటమి అభ్యర్థులకు ప్రభుత్వం గన్‌మెన్‌లను కేటాయించింది. ఎన్నికల నేపథ్యంలో భద్రత కేటాయించాలన్న ప్రతిపాదన మేరకు కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబుకు ఇద్దరు గన్‌మెన్‌లను కేటాయించారు. కాకినాడ రూరల్ అసెంబ్లీ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు(నానాజీ)కి ఒక గన్‌మెన్ కేటాయించగా కాకినాడ ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌కి గన్‌మెన్ కేటాయించినట్టు సమాచారం.

ఎట్టకేలకు రేపటి పవన్ రోడ్‌షోకు అనుమతి

- తొలుత పర్మిషన్ నిరాకరించినట్లు అధికారుల సంకేతాలు
- టీడీపీ, జనసేన నేతల అభ్యంతరాలతో దిగివచ్చిన అధికారులు

పిఠాపురం, మే 8: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలో ఈనెల 10న నిర్వహించే రోడ్‌షోకు అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు బుధవారం రాత్రి పోలీసు అధికారులు టీడీపీ, జనసేన నేతలకు సమాచారం ఇచ్చారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న పవన్‌కల్యాణ్ శుక్రవారం నియోజకవర్గ పరిధిలో నిర్వహించే రోడ్‌షో, వారాహి సభకు అనుమతుల విషయంలో మంగళ, బుధవారాల్లో హైడ్రామా నెలకొంది. పిఠాపురంలో అదేరోజున సీఎం సభ ఉందని, అనుమతులు ఇవ్వడం లేదంటూ తొలుత చెప్పిన అధికారులు టీడీపీ, జనసేన నేతల అభ్యంతరాలతో దిగివచ్చారు. మంగళవారం పవన్ రోడ్‌షోకు అనుమతుల కోసం రూట్‌మ్యాప్‌తో సహా దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లిన టీడీపీ, జనసేన నేతలను సర్వర్ పనిచేయడం లేదంటూ సాయంత్రం వరకూ వేచి చూసేలా చేసి చివరకు ఆన్‌లైన్ చేశారు. సీఎం జగన్ సభ కోసమే అధికారులు పవన్ రోడ్‌షో సభకు ఆటంకం కలిగిస్తున్నారంటూ అనుమానాలు వ్యక్తమయ్యాయి. బుధవారం ఉదయం సీఎం జగన్ 10వతేదీ మధ్యాహ్నం పిఠాపురంలో సభ నిర్వహిస్తున్నారని, వారు రాష్ట్రస్థాయిలో అనుమతులు తీసుకున్నారని, అందువల్ల పవన్ రోడ్‌షోకు అనుమతులు ఇవ్వలేమని అధికారులు సంకేతాలు ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు ఈ విషయంపై పోలీసు, ఎన్నికల అధికారులను ప్రశ్నించారు. తాము ముందు అనుమతులకోసం దరఖాస్తు చేసుకున్నామని, సీఎం సభ తర్వాత లెటర్ ఇచ్చారని, అటువంటప్పుడు తమకు అనుమతులు ఇవ్వకపోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వర్మ, మర్రెడ్డి కాకినాడ డీఎస్పీ హనుమంతరావును కలిసి తాము ముందుగానే 10న పవన్ రోడ్‌షో, సభలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నామని, ఆ ప్రకారం అనుమతులు ఇవ్వాలని కోరారు. దీనిపై పోలీసు, ఎన్నికల అధికారులు తర్జనభర్జనలు పడ్డారు. పిఠాపురంనుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పవన్ పోటీ చేస్తున్నందున, ఇక్కడ చేసే రోడ్‌షో, సభలకు అనుమతులు ఇవ్వకుంటే వివాదం అవుతుందనే భావనతో అధికారులు చివరికి అనుమతులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. దీనిపై వర్మకు పోలీసు అధికారులు రాత్రి 9గంటల సమయంలో సమాచారం ఇచ్చారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి 2గంటల వరకూ, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 10గంటల వరకూ రోడ్‌షో, సభలు ఉంటాయని తెలిపారు. కాగా 10న జరగాల్సిన సీఎం సభ 11వతేదీకి వాయిదా పడినట్టు సమాచారం.

ప్రత్తిపాడులో పట్టు కోసం వ్యూహ రచనలు

అభ్యర్థితో.. ఒకరోజు



ర్యాలీలో ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి సత్యప్రభకు పూలతో స్వాగతం పలికి భారీ గజమాల వేస్తున్న టీడీపీ, జనసేన శ్రేణులు

ఉదయం కాఫీ తాగుతూ దినపత్రిక చదువుతున్న సత్యప్రభ

ఎన్నికల పోలింగ్‌కు ఇక నాలుగురోజులే గడువు ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్తిపాడు కూటమిఅభ్యర్థి వరుపుల సత్యప్రభ ప్రచారాన్ని మరింత ఉధృతం చేసి బిజీగా గడుపుతుండగా ఆంధ్రజ్యోతి బుధవారం ఆమెతో 'అభ్యర్థితో ఒకరోజు' కార్యక్రమం నిర్వహించింది. ఆమె ఉదయం 5.30 గంటలకు లేచి కాఫీ తాగి దినపత్రికను చదివారు. 7.30గంటల సమయంలో తన భర్త చిత్రపటం వద్ద కాసేపు ప్రార్థన చేశారు. 9గంటలకు ఆమె ప్రచారానికి పెదనాపల్లి గ్రామానికి వెళ్లారు. అక్కడ టీడీపీ ఉభయగోదావరి జిల్లాల కోఆర్డినేటర్ సానా సతీష్‌తో కలిసి ప్రచారంచేశారు. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత దళితనేతలతో సమావేశమయ్యారు. పలువురు టీడీపీలో చేరగా వారిని ఆహ్వానించారు. సాయంత్రం 4గంటలకు కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌తో సమావేశమై కాసేపటికి యర్రవరం సెంటర్‌నుంచి ర్యాలీగా బయలుదేరి రౌతులపూడి మీదుగా వెళ్లి రాత్రి 8.30గంటలకు చింతలూరులో ముగించారు. -వివరాలు 7వపేజీలో..

బూత్ క్యాప్చరింగ్‌కు పాల్పడితే జైలుకే

పెద్దాపురం, మే 8: ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాన్ని స్వాధీనం చేసుకోవడం అధికారులను బెదిరించి బ్యాలెట్ పేపర్లు, ఈవీఎంలు స్వాధీనం చేసుకోవడాన్ని బూత్ క్యాప్చరింగ్ అంటారు. ఈవీఎంలు ధ్వంసం చేయడం, విరగ్గొట్టడం, ఎన్నికల గుర్తులపై సిరా పొయ్యడం, వంటి విధానాలు ఇందులో భాగమే. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లను భయపెట్టడం, పోలింగ్‌ను అడ్డుకోవడం నేరం. ప్రభుత్వ సిబ్బంది ఇలాంటివి చేస్తే ఐపీసీ 1951 సెక్షన్ 135 ఏ, 135 ప్రకారం మూడు నుంచి ఐదు సంవత్సరాలు జైలుశిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ఇతరులు అయితే ఒకటి నుంచి మూడు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తారు.

రోజుకు 27 పైసలు

ఓటు హక్కును అమ్ముకునే వారు ఈ లెక్కలు చూడాలి

సామర్లకోట, మే 8: ఈ నెల 13న జరుగనున్న సాధారణ ఎన్నికలలో ఓటు హక్కును అమ్ముకునే వారు ఒకసారి ఆలోచించాలి. మన భవిష్యత్తుకు బాటలు వేసే ఆదర్శ ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఉపయోగించాల్సిన ఓటును అమ్ముకొని దుర్వినియోగం చేస్తే ఐదేళ్లూ కష్టాలు ఎదుర్కోవాల్సిందే. పదికో పరక్కో ఓటును అమ్ముకుని అనర్హులకు ఓటు ఆయుధాన్ని అందించవద్దు. మనం వేసే ఓటు ఐదేళ్లూ సుస్థిర ప్రభుత్వం అందరి సంక్షేమం కాంక్షించే విధంగా ఉండాలి. ఓటుకు రాజకీయ పార్టీలు ఇచ్చే మొత్తం ఐదేళ్లకూ లెక్కిస్తే రోజుకు ఎంతవుతుందో ఒక్కసారి గమనించాలి.

ఏడాదికి 365 రోజుల చొప్పున ఐదేళ్లకు 1825 రోజులు..

ఓటుకు వారు ఇచ్చే మొత్తం రోజువారీ లెక్కిస్తే..

రూ. 500 ఇస్తే రోజుకు రూ. 0.27 పైసలు అవుతుంది. రూ.1000 ఇస్తే రోజుకు రూ. 0.56 పైసలు, రూ. 1,500 ఇస్తే రోజుకు రూ.0.82 పైసలు, రూ. 2,000 ఇస్తే రోజుకు రూ.1.10 పైసలు అవుతుంది. రూ. 2,500 ఇస్తే రోజుకు రూ. 1.37 పైసలు మాత్రమే మనకు వస్తుంది. ఒకవేళ రూ. 3,000 ఇస్తే రోజుకు రూ.1.65 పైసలు మనకు ఇచ్చినట్లు.. మరి రూ. 4,000 ఇచ్చారనుకోండి రోజుకు రూ. 2.20 పైసలు అవుతుంది. రూ. 5,000 ఇస్తే రోజుకు రూ. 2.74 పైసలు మాత్రమే నాయకుడు మనకు ఇచ్చినట్లు.. చూసారా మన విలువ పైసలతో సమానం అన్నమాట..



- ఓటుకు వైసీపీ రేటు రూ.2,500
- కొన్ని చోట్ల రూ.3 నుంచి 4వేలు కూడా
- వీధుల్లో పంపిణీ మొదలైంది..
- అంతా బహిరంగమే
- జనంలో పట్టులేకపోవడంతో డబ్బుపై ఆధారపడిన వైసీపీ
- పగలు, రాత్రి పంపిణీ పనిలోనే నాయకులు

ఓ వైపు సర్వేలు.. మరోవైపు జననాడి.. కూటమి విజయ ప్రభంజనం తప్పదని స్పష్టం చేస్తుండడంతో వైసీపీ పెద్ద సంఖ్యలో ఓట్ల కొనుగోలుపై ఆధారపడింది. పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థులు లెక్కల నుంచి తప్పించిన కోట్లాది రూపాయల నల్లధనాన్ని ప్రజలకు పంచేస్తున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు రోజుకు రాజమహేంద్రవరం సిటీలో కొన్ని వార్డులను ఎంచుకొని పగలూ, రాత్రి అదే పనిమీద ఉంటున్నారు. వార్డుల్లో బహిరంగంగానే ఇదంతా జరుగుతున్నా యంత్రాంగం పసిగట్టలేకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి..

పంచేస్తున్నారు!

ఓట్ల కొనుగోలు మొదలుపెట్టిన వైసీపీ

రాజమహేంద్రవరం సిటీలో నగదు పంపిణీ



రాజమహేంద్రవరం, మే 8(ఆంధ్రజ్యోతి):

వీధుల్లోని వైసీపీ నాయకులకు నగదు పంపిణీ కార్యక్రమాన్ని వైసీపీ పెద్దలు అప్పగించారు. ఇప్పటికే రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో కొన్ని వార్డుల్లో పంపిణీ పూర్తయినట్లు తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత కుక్కర్లు, ఫ్యాన్లు, వంటసామగ్రి, డిన్నర్ సెట్లు, హాట్‌ప్యాక్‌లను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. మహిళా దినోత్సవరం, ఉగాది, శ్రీరామనవమిని చూపి వేలాది చీరలను విచ్చలవిడిగా ఇచ్చేశారు. ఇప్పుడు వీధుల్లో పంపకాలను మొదలు పెట్టారు. రెండు రోజుల నుంచీ ఈ తంతు నడుస్తోంది. బుధవారం రాజమహేంద్రవరంలోని క్వారీ మార్కెట్ ఏరియా, మల్లికార్జుననగర్, నారాయణపురం, వీఎల్‌పురం, ఇన్నీసుపేట, తాడితోట తదితర చోట్ల ఓటుకు రూ.2500 చొప్పున వైసీపీ పంచిపెట్టింది. వైసీపీకి చెందిన కార్యకర్తలు ఆయా ఇళ్లకు వెళ్లి ఓటరు స్లిప్పులు, ఓటరు కార్డు పరిశీలించి, ఫోన్ నంబరుతో సహా ఓటరు వివరాలను నమోదు చేసుకొని ఓటుకు రూ.2,500 ఇచ్చారు. ఒకే ఇంట్లో ముగ్గురు ఓటర్లు ఉన్నా రూ.10 వేలు ముట్టజెప్పారు. డబ్బులు ఇస్తున్నాం కాబట్టి ఓటు తమకే వేయాలని చెప్పారు. తమను కచ్చితంగా తిరస్కరిస్తారనే అనుమానం ఉన్నచోట్ల ఓటుకు రూ.3వేల నుంచి రూ.4వేల వరకూ చేతిలో పెట్టారు. డబ్బులతోపాటు వైసీపీ కరపత్రాలు, బ్యాలెట్ నమూనాలను అందజేస్తున్నారు.



ఎన్నికల షెడ్యూల్‌కి ముందు నుంచే ఆయా వార్డుల్లోని వైసీపీ నాయకుల ఇళ్లకు పెద్ద మొత్తంలో డబ్బులు చేర్చినట్లు తెలుస్తోంది. ఉదాహరణకు ఒక వార్డులోని 20 వీధులు ఉంటే రెండు, మూడు వీధులకు కలిపి ఒక వైసీపీ కార్యకర్త ఇంటి వద్ద డబ్బు ఉంచారు. ఇలా కోట్లాది రూపాయలను చేరవేశారు. ఆ డబ్బును ఓటర్లకు ఇచ్చే బాధ్యత ఆ వీధిలోని

వైసీపీ నేతల ఇళ్లల్లో డబ్బు

ఇద్దరు ముగ్గురు వైసీపీ కార్యకర్తలకు అప్పగించారు. నెల క్రితమే వైసీపీ కార్యకర్తల ఇళ్లకు డబ్బులు పంపించే తతంగం నడిచింది. అయితే, పోలింగ్ తేదీకి వారం ముందు నుంచీ మాత్రమే ఓటర్లకు డబ్బులు ఇవ్వాలని నిర్ణయించడంతో సోమవారం నుంచి ఓట్ల కొనుగోలును షురూ చేశారు. డబ్బులు పంపిణీ అయిన తర్వాత ఆయా ఓటర్లకు ఫోన్లు చేసి 'ఫ్యాను అందిందా?' అంటూ ఆరా తీస్తున్నారని చెబుతున్నారు. ఎవరైనా తమకు డబ్బు అందలేదని చెబితే వారి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. వైసీపీ నాయకులు వలంటీర్ల ద్వారా ముందే సమాచారాన్ని సేకరించి క్రోడీకరించుకొని లిస్టులు తయారు చేశారు. ఆ లిస్టుల ప్రకారం డబ్బుల పంపిణీ జరుగుతోందని సమాచారం. నియోజకవర్గాల పరిధిలో ఫోన్ నంబరుతోసహా ప్రతి ఓటరు వివరాలు వైసీపీ నాయకుల చేతుల్లో ఉన్నాయి. వైసీపీ డబ్బు పంపిణీకి ఎక్కువగా పేదలు, మధ్య తరగతి ప్రజానీకం నివాసం ఉండే ఏరియాలను ఎంచుకుంది. అక్కడ ముందుగా డబ్బులు పంచుతున్నారు. తర్వాత మిగతా ప్రాంతాలకు వెళుతున్నారు. ఉదాహరణకు నారాయణపురం వాంబే కాలనీ, ఆ చుట్టుపక్కల మంగళవారం వైసీపీ ఓట్ల కొనుగోలుకు డబ్బులు పంపిణీ చేసింది. రెండు రోజుల్లో మిగతా ఇళ్లకు డబ్బులు వస్తాయని ఆ సమయంలో వైసీపీ నాయకులు చెప్పారు. దీంతో ఆ వార్డుల్లోని ప్రజలు ఓటరు స్లిప్పులతో ఎదురు చూస్తున్నారు.

ఓటుకు రూ.1500

రౌతులపూడి మండలంలో పంపిణీ

రౌతులపూడి, మే 8: వైసీపీ ఓటర్లకు డబ్బు పంపకం మొదలుపెట్టింది. ఒక్క ఓటుకు రూ.1500 వందలు ఇస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఎ.మల్లవరం, లచ్చిరెడ్డిపాలెం, గుమ్మరేగులతో పాటు కొన్ని గ్రామాల్లో ఇప్పటికే డబ్బులు పంచారు. సొమ్ములును బూత్ ఏజెంట్, బూత్ కన్వీనర్, రాజీనామా చేసిన వలంటీర్, అభ్యర్థి నియమించుకున్న ప్రతినిధితో పాటు పంచుతున్నారు. మిగిలిన గ్రామాల్లో రెండు రోజుల్లో పంచడానికి వైసీపీ నాయకులు ప్రణాళిక రచిస్తున్నారు.

బండారుతో వెంకటేశ్వరరావు



కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎన్‌ఆర్‌ఐ ప్రచారం


ఆలమూరు, మే 8: కూటమి అభ్యర్థుల విజయం కోసం ఎన్‌ఆర్‌ఐలు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక గ్రామానికి చెందిన రాయుడు వెంకటేశ్వరరావు ఉద్యోగరీత్యా బహ్రెయిన్‌లో స్థిరపడ్డారు. జనసేన కన్వీనర్‌గా ఉన్న ఆయన ఇక్కడకు వచ్చి రెండు నెలలుగా రాష్ట్రంలో కూటమి అభ్యర్థుల విజయం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. సొంత నియోజకవర్గమైన కొత్తపేటలో టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావు, పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్, రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబునాయుడు అధ్వర్యంలో ఇటీవల విజయవాడలో జరిగిన ఎన్‌ఆర్‌ఐల సమావేశంలోనూ పాల్గొన్నారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ పిలుపునకు స్పందించి కూటమి అభ్యర్థుల విజయానికి తన వంతు కృషి చేస్తున్నట్టు రాయుడు వెంకటేశ్వరరావు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు.



మద్యం డంప్

కొత్తపల్లి, మే 8: కొత్తపల్లి మండల తీరప్రాంతాల్లో అక్రమంగా మద్యం స్టాక్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అధికార పార్టీకి చెందిన పలువురు హేచరీల్లో గుట్టుచప్పుడు కాకుండా భారీ స్థాయిలో మద్యాన్ని డంప్ చేసినట్లు తెలిసింది. ఒక పక్క రేయింబవళ్లు మండలంలో ప్రధాన సెంటర్లో చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేసినప్పటికీ తీర ప్రాంతం గుండా హేచరీల గొడౌన్‌లో భారీగా మద్యాన్ని నిల్వ చేయడం గమనార్హం.

తిరుగులేని ప్రాబల్యం



కారం బాపన్నదొర



చోడి మల్లికార్జునుడు



రత్నాబాయి



గొర్లె ప్రకాశరావు



చిన్నం జోగారావు



శీతంశెట్టి



చిన్నం బాబూరమేష్



తీర్పులో ప్రత్యేకం

అభ్యర్థుల కన్నా పార్టీ ఇమేజే కీలకం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఏకైక ఎస్టీ రిజర్వుడు నియోజకర్గం రంపచోడవరం. తొలుత భద్రాచలం ద్విసభ్య నియోజకవర్గం గానూ, తర్వాత ఎల్లవరం గానూ ప్రస్తుతం రంపచోడవరంగానూ మారింది. రాష్ట్రంలో వీచే ప్రతికూల, అనుకూల పవనాలకు సంబంధం లేకుండానే ఇక్కడి ఓటర్లు చెప్పే తీర్పు ప్రత్యేకం! ఓటర్ల మనోగతం పూర్తిగా తెలిసిన రాజకీయ పార్టీలు దీనిపై స్థిరమైన అభిప్రాయంతోనే ఉంటున్నాయి. అభ్యర్థులతో సంబంధం లేకుండానే పూర్తిగా పార్టీ ఇమేజ్‌తోనే ఎన్నికలు సాగే నియోజకవర్గంగా రంపచోడవరాన్ని చెప్పుకోవచ్చు.

(రంపచోడవరం):

15 ఎన్నికల్లో..

ఇంత వరకు జరిగిన 15 ఎన్నికలను గమనిస్తే.. 1952లో కిసాన్ మజ్దూర్ పార్టీకి పట్టం కట్టిన ప్రజలు, 1955లో కమ్యూనిస్టు పార్టీకి పట్టం కట్టారు. ఈ రెండు దఫాల్లో అప్పట్లో తూర్పుగోదావరి పరిధిలోనే భద్రాచలం ఉండడంతో ఆ పేరుతోనే ఈ నియోజకవర్గం కొనసాగింది. ఇద్దరు సభ్యుల నియోజకవర్గంగా ఒక గిరిజనుడిని, మరో గిరిజనేతరుడిని ఎన్నుకోవాల్సి వచ్చేది. ఈ రెండు ఎన్నికల్లోనూ ఇద్దరు సభ్యులనీ క్రాస్ ఓటింగ్ లేకుండా ఒకే పార్టీ నుంచి ఎన్నుకోవడం విశేషం. వ్యక్తుల కంటే పార్టీలకే ఇక్కడి ప్రజల ప్రాధాన్యత అన్నది ఆదిలోనే రుజువు చేశారు. తర్వాత 1962లో జరిగిన పునర్విభజనలో ఎల్లవరం ప్రత్యేకంగా ఆవిర్భవించడంతో అప్పటి ఎన్నికల్లో ఇక్కడి ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. నాటి నుంచి 1978 వరకూ వరుసగా ఐదుసార్లు కాంగ్రెస్‌నే గెలిపించారు.




కోసూరి కాశీవిశ్వనాథ్




వంతల రాజేశ్వరి



నాగులాపల్లి ధనలక్ష్మి



ఏజెన్సీలో అందమైన దృశ్యాలు



భూపతిపాలెం రిజర్వాయర్..





టీడీపీకి కంచుకోట

1983 ఎన్నికల్లో ఇప్పటి మాదిరిగా ఎటువంటి ప్రచార మాధ్యమాలు లేకపోయినా ఎవరూ ఊహించని రీతిలో ఇక్కడ ఓటర్లు దివంగత ఎన్టీరామారావు పార్టీగా తెలుగుదేశానికి పట్టం కట్టారు. ఇప్పటికంటే దారుణమైన భౌగోళిక పరిస్థితులలో, సరైన మౌలిక సదుపాయాలు, సమాచారం వ్యవస్థ లేని రోజుల్లోనే తెలుగుదేశం లోతట్టు గిరిజన ప్రాంతాలకు చేరిపోయింది. అప్పటి నుంచి 2004 ఎన్నికల వరకూ జరిగిన ఆరు ఎన్నికల్లో తెలుగుదేశానికి ఏజెన్సీలో ఢోకా లేకుండా పోయింది. వరుస హ్యాట్రిక్ విజయాలు టీడీపీకి ఇక్కడ స్థిరమైన స్థానాన్ని కల్పించాయి. ఆ పరంపరలో ఈ స్థానం తెలుగుదేశానికి డబుల్ హ్యాట్రిక్‌ను తెచ్చిపెట్టగా ఒక శీతంశెట్టి వెంకటేశ్వరరావుకు హ్యాట్రిక్‌ను తెచ్చిపెట్టింది. 2004 ఎన్నికల్లో రాష్ట్రంలోనూ, దేశంలోనూ కాంగ్రెస్ గాలి వీచినా కూడా కొత్త అభ్యర్థి చిన్నం బాబూ రమేష్‌ను బరిలోకి దించి కూడా తెలుగుదేశమే ఈ స్థానాన్ని కైవసం చేసుకుంది.

2009 నుంచి పరిస్థితిలో మార్పు

2009 ఎన్నికల్లో ఊహించని రీతిలో తెలుగుదేశం పరాజయాన్ని చూసింది. కాంగ్రెస్ తరపున కోసూరి కాశీ విశ్వనాథ్ ఆ ఎన్నికల్లో విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ ఈ స్థానాన్ని కోల్పోగా రాష్ట్రమంతా తెలుగుదేశం విజయం సాధించినా ఇక్కడ మాత్రం రెండో మారు కూడా దేశం పరాజయాన్ని నమోదు చేసుకుంది. వైసీపీ అభ్యర్థిగా అనంత ఉదయభాస్కర్ బరిలోకి దిగగా ఆయన నామినేషను తిరస్కరణకు గురైతే ఊహించని రీతిలో ప్రత్యామ్నాయంగా తెరపైకి వచ్చిన వంతల రాజేశ్వరితోనే వైసీపీ విజయం సాధించింది. కాగా ఎన్నికలు గడిచిన మూడేళ్లకు రాజేశ్వరి ఊహించని రీతిలో తెలుగుదేశం కండువా కప్పుకుని వైసీపీకి ఝలక్ ఇచ్చారు. దీంతో 2019 ఎన్నికల్లో ఆమెనే తెలుగుదేశం నుంచి పోటీ చేయగా నాగులాపల్లి ధనలక్ష్మి అనే ఉపాధ్యాయురాలు వైసీపీ తరపున బరిలో దిగి విజయం సాధించారు. ఇపుడు కూడా వైసీపీ నుంచి ధనలక్ష్మే బరిలో ఉండగా తెలుగుదేశం కొత్త అభ్యర్థిగా అంగన్‌వాడీ టీచర్ అయిన మిరియాల శిరీషాదేవిని బరిలోకి దించింది. వీరితో పాటు సీపీఎం తరపు నుంచి లోతా రామారావు బరిలో ఉన్నారు.

1952 నుంచి 2019 వరకు ఎవరు ఏ పార్టీ నుంచి విజేతగా నిలిచారో సమగ్ర వివరాలు

సంవత్సరం	విజేత	పార్టీ
1952	కారం బాపన్నదొర(ఎస్టీ)	కిసాన్ మజ్దూర్ పార్టీ
	వై.వెంకటేశ్వరరావు	కిసాన్ మజ్దూర్ పార్టీ
1955	శ్యామల సీతారామయ్య(ఎస్టీ)	కమ్యూనిస్టు పార్టీ
	మహ్మద్ తహశీల్	కమ్యూనిస్టు
1962	చోడి మల్లికార్జునుడు	కాంగ్రెస్
1967	చోడి మల్లిఖార్జునుడు	కాంగ్రెస్
1972	టి.రత్నాభాయి	కాంగ్రెస్
1978	గొర్లె ప్రకాశరావు	కాంగ్రెస్
1983	చిన్నం జోగారావు	టీడీపీ
1985	చిన్నం జోగారావు	టీడీపీ
1989	శీతంశెట్టి వెంకటేశ్వరరావు	టీడీపీ
1994	శీతంశెట్టి వెంకటేశ్వరరావు	టీడీపీ
1999	శీతంశెట్టి వెంకటేశ్వరరావు	టీడీపీ
2004	చిన్నం బాబూరమేష్	టీడీపీ
2009	కోసూరి కాశీవిశ్వనాథ్	కాంగ్రెస్
2014	వంతల రాజేశ్వరి	వైసీపీ
2019	నాగులాపల్లి ధనలక్ష్మి	వైసీపీ

తికమక 'బ్యాలెట్'

గోపాలపురం, మే 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల్లో పని చేసే సిబ్బందికి ఓటు ఎక్కడ వేయాలో మూడు రోజుల పాటు అర్థం కాక తికమకపడ్డారు. ఈ నెల 6వ తేదీ మొదటి రోజు బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో, రెండో రోజు తహశీల్దార్ కార్యాలయంలో, మూడో రోజు బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. అయితే తమ ఓటు హక్కు ఎక్కడ వినియోగించుకోవాలో అర్థం కాక పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు తికమకపడ్డారు. దీంతో తమ ఓటు ఎన్నికల్లో వినియోగించుకోలేమనే గందరగోళంలో ఉద్యోగులు ఉన్నారు. ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ అర్థం కాని పరిస్థితుల్లో ముగిసింది.



మందుబాబుల పాట్లు

పి.గన్నవరం, మే 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం అమ్మకాలపై ఎన్నికల కమిషన్ రోజువారీ అమ్మకాలపై కొన్ని మార్గదర్శకాలను విధించింది. దీంతో నిబంధనలు ప్రకారం కొన్ని షాపుల్లో సాయంకాలం లోపులోనే అమ్మకాలు పూర్తవుతున్నాయి. దీంతో మద్యం కోసం మందుబాబులు పాట్లు పడుతున్నారు. ఈ క్రమంలోనే పి.గన్నవరంలో బుధవారం మూడు షాపుల్లో ఉండగా రెండు షాపుల్లో అమ్మకాలు పూర్తికాగా ఉన్న షాపుపై మద్యం కోసం మందుబాబులు ఎగబడ్డారు. స్థానికులు సైతం ఆ షాపు వద్ద సందడిని ఆసక్తిగా తిలకించారు. గత మూడు రోజులుగా వైసీపీ అభ్యర్థి డబ్బులు పంచడంతో మందు షాపులు కళకళలాడుతున్నాయని స్థానికులు చెప్పుకుంటున్నారు.

చెందుర్తిలో ఉద్రిక్తత

ఒకే సమయంలో టీడీపీ, వైసీపీ ప్రచారాలు

టీడీపీ శ్రేణులను పోలీసులు నియంత్రించడంపై ఆగ్రహం


టీడీపీ క్యాడర్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

గొల్లప్రోలు రూరల్, మే 8: గొల్లప్రోలు మండలం చెందుర్తిలో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామంలో వైసీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతా విశ్వనాథ్ ప్రచారం చేపట్టారు. అదే సమయంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా టీడీపీ నిర్వహిస్తున్న ప్రచారాన్ని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రారంభించారు. ఇరుపార్టీల ప్రచార ర్యాలీలు ప్రారంభమై సాగుతున్న తరుణంలో ఒకే చోట ఎదురయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ, ఇతర పోలీసులు టీడీపీ నాయకులు, కార్యకర్తల ప్రచారాన్ని నిలువరించారు. వైసీపీ ర్యాలీ వెళ్లే వరకూ డీజే కొట్టవద్దని, నినాదాలు చేయవద్దని టీడీపీ నేతలను హెచ్చరించారు. అదే సమయంలో అటుగా వెళుతున్న వైసీపీ ర్యాలీలో కొందరు జెండాలు చూపుతూ నినాదాలు చేయడంతో టీడీపీ కార్యకర్తలు తీన్‌మార్, డీజే కొట్టారు. ఈ సమయంలో ఎస్ఐ ఒక యువకుడి పట్ల దురుసుగా ప్రవర్తించారని టీడీపీ నాయకులు ఆరోపించారు. తమ ర్యాలీని ఆపి వైసీపీ వారిని పంపేయడం, తమపై ఆంక్షలు పెట్టి, వైసీపీ వారు నినాదాలు చేస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడం పట్ల టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత ఏర్పడింది. ఈలోగా అదనపు పోలీసు బలగాలను రప్పించి అక్కడ మోహరించారు. కొంత సమయం తర్వాత ఎవరి ప్రచారం వారు చేసుకున్నారు.

ఓట్ల గల్లంతుపై ఉద్యోగుల ఆవేదన

కలెక్టరేట్(కాకినాడ), మే 8: ప్రభుత్వ ఉద్యోగుల ఓట్లు గల్లంతు ప్రక్రియ ఐదో రోజు అయిన బుధవారం కూడా కొనసాగింది. ఓటు వేద్దామని కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల పోలింగ్ కేంద్రానికి విచ్చేసిన ఉద్యోగులకు చుక్కెదురైంది. దీనిలో ఎక్కువగా ఉపాధ్యాయులే ఉండడం విశేషం. ఇతర జిల్లాల్లో ఓట్లు ఉండి కాకినాడ జిల్లాల్లో ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు మంగళవారం, బుధవారం ఓటు వేయడానికి అవకాశం కల్పించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేద్దామని వస్తే జాబితాలో పేర్లు లేవని ఎన్నికల అధికారులు వెనక్కి పంపించారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు. నిబంధనల ప్రకారం ఫారం-12డీ సమర్పించినప్పటికీ ఓటర్ల జాబితాలో పేర్లు కన్పించడం లేదని ఆవేదన చెందారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులపై జగన్ కుట్ర

జగన్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయులు ధర్నాలు చేసిన నేపథ్యంలోనే ఉపాధ్యాయుల ఓట్లను గల్లంతు చేశారనే విమర్శలు వస్తున్నాయి.

ఓటు వేసిన 3,136 మంది ఉద్యోగులు


ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

కాకినాడ రూరల్,మే 8: రెండు రోజులుగా నిర్వహించిన జిల్లాస్థాయి పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా 4,250 మంది ఉద్యోగులకు గానూ 3,136 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కాకినాడ జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న రెండో రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్ అధికారులతో కలిసి పరిశీలించారు. గత రెండు రోజులుగా పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా 74 శాతం మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. రెండో రోజు తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఉద్యోగులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించామని కలెక్టర్ తెలిపారు. జేసీ రామ్‌సుందర్ ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఆర్వో డాక్టర్ తిప్పేనాయక్, ఈఆర్వో వెంకటరావు, నోడల్ అధికారి శ్రీనివాసరావు ఉన్నారు.

ఘనంగా తలుపులమ్మ తల్లి జాతర

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



తునిరూరల్, మే 8: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆధ్వర్యంలో తలుపులమ్మ తల్లిజాతర కన్నుల పండువగా జరిగింది. లోవ కొత్తూరులో నిర్వహించిన ఈ జాతర మహోత్సవానికి పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. బుధవారం సాయంత్రం లోవకొత్తూరులో నిర్వహించిన అమ్మవారి శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఏలేరులో అడుగంటిన నీరు


ప్రాజెక్టు గేట్ల వద్ద నీరులేని దృశ్యం

ఏలేశ్వరం, మే 8: ఏలేరులో ప్రాజెక్టులో వేసవి ఎండలకు క్రమేపీ నీటి నిల్వలు అడుగంటాయి. వైసీపీ ప్రభుత్వం ముందుచూపు లేకపోవడంతో రైతులకు సాగునీరు లేకుండా పోయింది. దీంతో దిగువ ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 86.56మీటర్లకుగాను 69.42 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 3.89 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయి. ప్రాజెక్టు కింద 56వేల ఎకరాలకు రాబోయేరోజుల్లో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతోపాటు దిగువ ఏలేరు కాలువలో నీటి సరఫరా నిలిపివేయడంతో పశువులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. నీటి నిల్వలు తగ్గితే ఫిల్టర్ బెడ్ ద్వారా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ఏలేరులో నీటి నిల్వలు తగ్గడంతోపాటు వరిసాగు పూర్తి కావడంతో ఏలేరు కాలువకు నీటి సరఫరా నిలిపివేశారు. నీటి నిల్వలపై రాబోయేరోజుల్లో ఖరీఫ్ సాగుపై రైతులు ఆందోళన చేస్తున్నారు. ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోవడంతో విశాఖకు నీటిని తరలించడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రాజెక్టులో నీటిని మోటార్ల సహాయంతో పైపుల ద్వారా 180 క్యూసెక్కుల నీటిని తరలింపుపై ఆందోళనవ్యక్తంచేస్తున్నారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రతినిధులు

పాలిసెట్ ఫలితాల్లో 'తిరుమల' విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరంరూరల్ మే 8: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన పాలిసెట్ ఫలితాల్లో రాజమహేంద్రవరంలో గల తిరుమల పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జె.యశ్వంత్ సాయి, సీహెచ్‌వీఎస్ఎస్ వర్షిణి 120 మార్కులకు 120 మార్కులు, జి.ప్రభవ్ తేజ, డి.శ్రీవేద్‌లు 120 మార్కులకు గాను 119 మార్కులు సాధించి స్టేట్ 7వ ర్యాంకును సాధించాడన్నారు. చిట్టూరి త్రివేణి, ఈడుపుగంటి వంశీధర్, పదిలం వెంకట నాగ సూర్యధావన్ స్టేట్ 14వ ర్యాంకు, గన్నంనీడి వాత్సల్య స్టేట్ 21వ ర్యాంకు, మెకరాల కృష్ణ శ్రావణి సాకేత్, మంగు కిరణ్ సుబ్రహ్మణ్య స్టేట్ 24వ ర్యాంకు, యడ్లూరి కృష్ణ చైతన్య స్టేట్ 40వ ర్యాంకు, నల్లబోతుల షణ్ముఖ సాయినాథ్, మద్దు సూర్యదేవ్ చింతపల్లి భార్గవ శ్రీవెంకట గణేష్, దొండి ప్రీతిక శరణ్య స్టేట్ 42వ ర్యాంకు సాధించారన్నారు. టాప్ 20లో 7 ర్యాంకులు టాప్ 50లో 15 ర్యాంకులు, టాప్ 100లో 24 ర్యాంకులు సాధించి అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్లతో కలిసి అభినందించారు.

నేను నికార్సయిన కాపుని

పవన్‌కల్యాణ్‌పై ముద్రగడ ఫైర్

కిర్లంపూడి, మే 8: తాను నికార్సయిన కాపునని, తన తండ్రి, తల్లి, కోడలు అందరూ కాపులేనని, మీ చరిత్ర బయటపెట్టాలని వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు సవాల్ చేశారు. చిన్నాచితక నటీనటులతో ప్రచారం చేయిస్తున్నారంటే ఓటమి తెలిసిపోయిందని విమర్శించారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో ముద్రగడ బుధవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కాపు ఉద్యమాన్ని అణిచివేశారన్నారు. తనను, తన కుటుంబాన్ని రోడ్డుకీడ్చారన్నారు. పవన్‌కల్యాణ్ హైదరాబాద్ నుంచి వస్తే ఇక్కడ పిఠాపురంలో పట్టం కట్టాలా అని ప్రశ్నించారు. తన కూతురికి తనకు మధ్య చిచ్చు పెట్టిన పవన్‌కల్యాణ్ వాళ్ల ఇంట్లో ఆడవాళ్ల కోసం ఎందుకు మాట్లాడలేకపోతున్నారని విమర్శించారు. పవన్‌కల్యాణ్ ఒప్పుకుంటే ఆయన మాజీ భార్యలు, ప్రస్తుత భార్యకు వైసీపీలో ఎమ్మెల్యే సీట్లు ఇప్పిస్తామన్నారు. పవన్‌కల్యాణ్ స్వచ్ఛమైన కాపు అయితే రికార్డు బయట పెట్టాలన్నారు. కాపు ముసుగులోకి కాపు వాడికి చేయరా అని కార్యకర్తలతో చెప్పిస్తున్నారని వంగా గీత కూడా కాపు కులస్తురాలేనన్నారు. ప్రజలు చప్పట్లు కొడుతుంటే పూనకం వచ్చి ఆవేశంతో పవన్‌కల్యాణ్ మాట్లాడుతున్నారన్నారు. సినిమాలో నటన ఇక్కడ చూపిస్తే జై కొట్టాలా అని ముద్రగడ ప్రశ్నించారు.

'పింఛను అందించాలి'

సామర్లకోట, మే 8: ఎల్ఐసీ బీమా పథకంలో జీవన్ అభయ్ పథకం కింద తనకు 2023 డిసెంబరుకు చెంది ఫింఛన్ సొమ్ములు చెల్లించకుండా పెద్దాపురం ఎల్ఐసీ అధికారులు తాత్సార్యం చేస్తున్నారని బీమాదారుడు సామర్లకోటకు చెందిన ఎస్‌కె. జిలాని వాపోయాడు. ఈ పథకంలో తన భార్యకూ, తనకు ఏడాదికి ఒకసారి పింఛను మొత్తంగా గత డిసెంబరు నెలలో రూ. 1.50 లక్షలు చెల్లించాల్సి ఉండగా 3నెలలుగా తనను తిప్పుతూ వేధిస్తున్నారని సామర్లకోటలో జిలాని వెల్లడించాడు.

వైసీపీకి ఓటు వేస్తే భవిష్యత్తు అంధకారం

» పెద్దాపురం కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప » గుడివాడ, పులిమేరు గ్రామాల్లో ప్రచారం


పులిమేరులో ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న చినరాజప్ప

పెద్దాపురం, మే 7: ఎన్నికల్లో సీఎం జగన్ నేతృత్వంలో అధికార వైసీపీకి మళ్లీ ఓటు వేస్తే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని పెద్దాపురం టీడీపీ కూటమి అభ్యర్థి నిమ్మ కాయల చినరాజప్ప అన్నారు. బుధవారం మండలంలోని గుడివాడ, పులి మేరు గ్రామాల్లో ఆయన జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబుతో కలసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రాజప్ప మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఆలోచించి ఓటువేయాలన్నారు. ఐదేళ్లగా వైసీపీ నా యకులు రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. అభివృద్ధి జాడలేదని, అన్యాయాన్ని ఎదిరించినవారిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. కేసులకు భయపడేది లేదన్నారు. రాష్ట్రం మళ్లీ గాడిలో పడాలంటేకూటమికి అధికారం కట్టబెట్టాలన్నారు. తుమ్మలబాబు మాట్లాడుతూ వైసీపీకి ఓటువేస్తే ఉన్న ఇళ్లను కూడా దోచుకోవడం ఖాయమన్నారు. ప్రణాళిక కలిగిన నాయకుడికి ఓటు వేయాలని, కూటమికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. వచ్చేది కూటమి ప్రభుత్వమే అని, వైసీపీకి ఓటమి ఖరారయ్యిందన్న భయం పట్టుకుందన్నారు. ప్రజలు రాష్ట్ర భవిష్యత్తు కోసం, తమ పిల్లల బాగుకోసం కూటమికి పట్టం కట్టాలన్నారు. కూటమితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలని కోరారు. టీడీపీ నేతలు చాగంటి గోపాలకృష్ణ, బుజ్జి, అంబటి దివాణం, తుమ్మల నాని పాల్గొన్నారు.


పులిమేరులో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న చినరాజప్ప

టీడీపీలో దివిలి సర్పంచ్ చేరిక

పెద్దాపురం మండలం దివిలి గ్రామ సర్పంచ్ పెంకే శ్రీను, మాజీ ఎంపీటీసీ మడికి వెంకట కృష్ణ తమ అనుచరులతో కలిసి చినరాజప్ప సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. టీడీపీ మండలాధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి) ఆధ్వర్యంలో వారు టీడీపీలోకి చేరారు. వారిక రాజప్ప పార్టీ కండువాను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.


టీడీపీలో చేరిన దివిలి సర్పంచ్ పెంకే శ్రీను తదితరులు

అభ్యర్థితో.. ఒకరోజు

ప్రత్తిపాడులో పట్టు కోసం వ్యూహరచనలు

» ప్రత్తిపాడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజాతో 'అభ్యర్థితో ఒకరోజు'

ప్రత్తిపాడు, మే 8: ఎన్నికల పోలింగ్ సమయం ఆసన్నమైంది. మరో 3రోజులే ఎన్నికల ప్రచారానికి గడువు ఉంది. ఈ తక్కువ సమయంలో ఎక్కువ అనుకూలతను చేసుకోవడానికి ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఎన్నికల ప్రచారంలో తన భర్త దివంగత వరుపుల రాజా నియోజకవర్గానికి అందించే సేవలు ఒకవైపు ప్రస్తావిస్తూ ముందుకు వెళ్తున్నారు. బుధవారం ఆమెతో ఆంధ్రజ్యోతి 'అభ్యర్థితో ఒకరోజు' కార్యక్రమం నిర్వహించింది.

ఉదయమే లేచి..


ఉదయం జనసేన కార్యకర్తలు అందించిన పండ్ల గిఫ్ట్‌తో సత్యప్రభ

ప్రత్తిపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా ప్రత్తిపాడులోని తన స్వగృహంలో 5.30గంటలకు నిద్రలేచి కాఫీతాగి దినపత్రికలను చదివారు. అనంతరం అల్పాహారాలు స్వీకరించి బయటకు వచ్చారు. ఉదయం 8గంటల సమయంలో హాల్లోఉన్న తన భర్త దివంగత టీడీపీ నేత వరుపుల రాజా చిత్రపటానికి నమస్కరించారు. జనసేన ముఖ్య నేతలు సత్యప్రభను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతోపాటు పండ్ల గిఫ్ట్‌ను అందజేశారు. తర్వాత టీడీపీ సీనియర్ నాయకులు, ముఖ్యకార్యకర్తలతో ఎన్నికల ప్రచారం వ్యూహాలపై సమాలోచనలు చేశారు. ఏలేశ్వరం నగర పంచాయతీ కౌన్సిలర్లతో మాట్లాడారు. 8.45గంటలకు క్రైస్తవ పాస్టర్లతో సమావేశమయ్యారు. పెదశంకర్లపూడికి చెందిన దళిత నాయకుడు సత్యప్రభను కలిసి మద్దతు తెలిపారు. 9గంటలకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలనుంచి వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరగా వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

పెద్దనాపల్లి ప్రచారానికి..


పెద్దనాపల్లిలో సానా సతీష్‌తో కలిసి ప్రచారం చేస్తూ..

ఉదయం 9.30గంటలకు వరుపుల సత్యప్రభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రత్తిపాడు మండలం పెదనాపల్లి గ్రామానికి బయల్దేరారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, గ్రామ సర్పంచ్ బుద్దాసూర్యప్రకాశరావు, బుద్దా ఈశ్వరరావు, ఏలేశ్వరం కౌన్సెలర్లు బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణ స్వామి సత్యప్రభకు ఘనస్వాగతం పలికారు. అదే సమయానికి టీడీపీ ఉభయగోదావరి జిల్లాల కోఆర్డినేటర్ సానా సతీష్ అక్కడకు చేరుకున్నారు. ప్రముఖ బుల్లితెర నటుడు ఇంద్రనీల్ వర్మ కూడా అక్కడకు వచ్చారు. సానా సతీష్, ఇంద్రనీల్ వర్మలతో కలిసి సత్యప్రభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మధ్యాహ్నం 2గంటలకు ఎన్నికల ప్రచారాన్ని పూర్తి చేసుకుని సత్యప్రభ తిరిగి ప్రత్తిపాడులోని తన స్వగృహానికి చేరుకున్నారు.

మధ్యాహ్నం దళిత నేతలతో భేటీ


సత్యప్రభను సన్మానిస్తున్న పెదశంకర్లపూడి దళిత నాయకులు

మధ్యాహ్నం 2.30గంటలకు భోజనం చేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం మాదిగ నేతలతో సమావేశమయ్యారు. దళితులపట్ల వైసీపీ ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోందని దళిత పథకాలను రద్దు చేసి ఇబ్బందులు పెడుతోందని దళిత నాయకులు ఆమె దృష్టికి తెచ్చారు. రాబోయే కూటమిప్రభుత్వంలో దళితులకు అన్ని విధాలుగా తమ నాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో న్యాయం జరుగుతుందని ఆమె అన్నారు. అనంతరం ప్రత్తిపాడు మండలం వెంకటనగరం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరాయి. అనంతరం జనసేన కార్యకర్తలు సత్యప్రభతో సమావేశమయ్యారు.

సాయంత్రం కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి ఉదయ్‌తో సమావేశం


కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్‌తో సమాలోచనలు చేస్తున్న సత్యప్రభ

కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రత్తిపాడులోని సత్యప్రభ ఇంటికి వచ్చారు. సమావేశమందిరంలో ఆమె తనయుడు సాయి తర్షిత్, కుమార్తె సత్యమాధురి, అనుచరులతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ప్రచార తీరులను సమీక్షించారు.

రాత్రి బైక్ ర్యాలీకి తరలివెళ్లిన సత్యప్రభ

సాయంత్రం 5గంటలకు యర్రవరం నుంచి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యప్రభ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబులతో కలిసి బైక్ ర్యాలీగా వెళ్లారు. యర్రవరం సెంటర్‌నుంచి వేలాదిమందిలతో ఈ ర్యాలీ బయల్దేరగా రౌతులపూడి వరకు కొనసాగింది. దారిపొడవునా టీడీపీ, జనసేన కార్యకర్తలు కూటమి అభ్యర్థులపై పూలవర్షం కురిపించారు. చింతలూరులో రాత్రి 8.30గంటలకు ర్యాలీ ముగిసింది. అక్కడినుంచి ఆమె ఇంటికి చేరుకున్నారు.

కూటమి గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి

» కూటమి ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్


ప్రత్తిపాడులో ప్రచారం నిర్వహిస్తున్న తంగెళ్ల ఉదయ్, వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు, మే 8: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి కుంటుపడి అధోగతి పాలైందని ప్రస్తుత ఎన్నికల కూటమి గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని కూటమి కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయంవద్ద బుధవారం వారు నాయకులతో సమావేశయ్యారు. అనంతరం మండలంలో చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ, ఉత్తరకంచి, ఒమ్మంగి, శరభవరం, గజ్జెనపూడి, చింతలూరు, వెంకటనగరం, యుజేపురం గ్రామాల్లో మోటార్‌బైక్ ర్యాలీతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి సత్యప్రభ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమి అభ్యర్థులను ప్రజలు ఎన్నికల్లో ఓట్లువేసి ఆశీర్వదించాలని కోరారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణలతో సాగునీటి సమస్య పరిష్కరిస్తామని కాకినాడ తీర ప్రాంతంలో కోతకు గురవుతున్న సముద్ర తీర ప్రాంతాన్ని అధునాత టెక్నాలజీతో పటిష్టంగా నిర్మిస్తామని ఎంపీ అభ్యర్థి ఉదయ్ తెలిపారు. మత్స్యకారులు నిర్వహించే తీర ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్‌లు నిర్మిస్తామన్నారు. పార్లమెంట్ పరిధిలో అన్ని గ్రామాల్లో 100శాతం సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు నిర్మిస్తామని, ఎస్ఈజెడ్ ప్రాంతంలో నూతన పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామని, గోదావరి ప్రాంత వంట రుచులను విశ్వవ్యాప్తంగా గుర్తించేందుకు వంటల ప్రావీణ్య యూనివర్సిటీని కాకినాడలో ఏర్పాటు చేస్తామన్నారు. పెద్దాపురం ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పరిచి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పార్లమెంట్ నియోజకవర్గంలో చేనేత రంగాన్ని అభివృద్ధి పరుస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో యువత, మహిళలు స్వయం ఉపాధికోసం అతి తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేయించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో క్రీడామైదానం ఏర్పాటు చేసి యువత క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకునేలా శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు కూడా ప్రసంగించారు. ఉత్తరకంచిలో బుధవారం సత్యప్రభ తనయుడు సాయితర్షిత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ మంతెన వెంకటరమణ, టీడీపీ జిల్లా నాయకులు ఇళ్ల అప్పారావులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించి కూటమి మేనిఫెస్టో కరపత్రాలు పంచారు. తన తల్లి సత్యప్రభకు సైకిల్ గుర్తుపైన, పార్లమెంట్ అభ్యర్థి ఉదయకు గాజుగ్లాసు గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు.

రౌతులపూడిలో సత్యప్రభ ప్రచారం

టీడీపీ, జనసేన శ్రేణుల భారీ ర్యాలీ

రౌతలపూడి, మే 8: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించగా దారిపొడవునా అభిమానులు గులాబీవర్షం కురిపించారు. టీడీపీ- జనసేన పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మేరకచామవరం, శృంగవరం, బంగార్యపేట, రౌతులపూడి గ్రామాల్లో వారు బుధవారం రోడ్‌షో నిర్వహించారు. రౌతులపూడిలో వారికి మాజీ ఎంపీపీ ఇంటిశెట్టి సూర్యభాస్కరావు, మాజీ సర్పంచ్ పైలసాంబశివరావు ఘనంగా స్వాగతం పలికారు. జనసేన-టీడీపీ నేతలు భారీ ర్యాలీ చేశారు.

ఏలేశ్వరం: యర్రవరం గ్రామంలో కూటమి అభ్యర్థులు సత్యప్రభ, ఉదయ్ శ్రీనివాస్ రోడ్‌షో నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నికల కోఆర్డినేటర్ సానా సతీష్, జనసేన ఇంచార్జ్ వరుపులతమ్మయ్యబాబు ఉన్నారు.

పవన్‌కు రికార్డు మెజార్టీతో విజయం ఖాయం : వర్మ


పిఠాపురంలో ఆటోలతో నిర్వహిస్తున్న ర్యాలీలో వర్మ

పిఠాపురం, మే 8: పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా రికార్డు స్థాయి మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పవన్‌కు మద్దతుగా పిఠాపురం పట్టణంలో ఆటోలు, కార్లతో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఆటోడ్రైవర్లతో ఆత్మీయ సమావేశం జరిగింది. వైసీపీ ప్రభుత్వం ఆటోడ్రైవర్లను ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. ఏటా రూ.10వేలు ఇస్తున్నట్లు చెబుతున్నా, ఫైన్ల రూపంలో అందుకు మూడింతలు వారి నుంచి లాగివేశారని ఆరోపించారు. అధ్వాన రహదారులతో రిపేర్లకు 20వేలకు పైగా ఖర్చు అవుతున్నదని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి యువతను నిర్వీర్యం చేశాడని, ఉద్యోగులు ఇవ్వకుండా మోసగించాడని మాజీ ఎమ్మెల్యే వర్మ తనయుడు, టీడీపీ యువ నాయకుడు గిరీష్‌వర్మ విమర్శించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం యువత ఏ విధంగా మోసం పోయింది, దగాకు గురయిందో, చదువుకున్న యువత ఉద్యోగా లు లేక ఎలా ఇబ్బందులు పడుతున్నది గిరీష్‌వర్మ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టి, టీడీపీ, జనసేన, బీజేపీకి అండగా నిలవాలని కోరారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం చెందుర్తి, చినజగ్గంపేట, ఏ.విజయనగరం గ్రామాల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కు, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌లకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పవన్‌కు మద్దతుగా ప్రచారం

కొత్తపల్లి, మే 8: పిఠాపురం కూటమి అభ్యర్థి పవన్‌కు గెలిపించాలని జబర్దస్త్ హాస్యనటుడు రైజింగ్ రాజు, సీరియల్ నటులు సుజాత, మురళి కోరారు. ఉప్పాడ వీవర్స్ కాలనీ, కొత్తపల్లిలో గాజు గ్లాసు గుర్తుపై ఓట్లేయాలని పవన్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఈనెల 13న ఎన్నికల్లో పవన్‌కు ఓట్లేసి భారీ మెజార్టీతో నెగ్గించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వర్మ సతీమణి లక్ష్మీదేవి వర్మ రమణక్కపేటలో గాజు గ్లాసులను చేత్తో పట్టుకుని ప్రచారం నిర్వహించారు. పెనుమల్లు కృష్ణారెడ్డి, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు

పిఠాపురం: పవన్‌కు మద్దతుగా 11వ వార్డు రామాలయం నుంచి వకీల్‌సాబ్ సినిమా ద్వారా సూపర్ ఉమెన్‌గా పేరు తెచ్చుకున్న సినీనటి సరళాదేవి ప్రచారం చేశారు. కర్నాటక, తమిళనాడుకు చెందిన పవన్ అభిమానులు, జనసేన నాయకులు పట్టణంలోని ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు.


కొత్తపల్లి ప్రచారంలో జబర్దస్త్, సీరియల్ నటులు

ముగిసిన చైత్రమాసోత్సవాలు

అన్నవరం, మే 8: సత్యదేవుడి తొలిపావంచా వద్ద కొలువైయున్న కనక దుర్గ ఆలయంలో చైత్రమాసోత్సవాలు బుధవారం చండీహోమ పూర్ణాహుతితో ముగిశాయి. పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనం తరం అమ్మవారికి పారాయణలు, జపములు, అనంతరం చండీహోమం నిర్వహించారు. పవిత్ర హోమగుండలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించగా 12గంటల నుంచి అన్నదానం నిర్వహించారు.

పటిష్టమైన బందోబస్తు నడుమ సార్వత్రిక ఎన్నికల నిర్వహణ : ఎస్పీ



ట్రైనీ ఐపీఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

కాకినాడ క్రైం, మే 8: ప్రశాంత వాతావరణంలో పటిష్టమైన బందోబస్తు నడుమ సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్టు, ఎన్నికల విధుల్లో మంచి అనుభవం గడించాలని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ కోరారు. సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న 8మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రిపోర్టు చేశారు. ఎస్పీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఛాలెంజ్‌గా తీసుకోవాలని, ఇది భవిష్యత్తులో ఉద్యోగ నిర్వహణలో అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన ట్రైనీ శిక్షణా పోలీసు అధికారులను కాకినాడ, పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించేందుకు కేటాయిస్తామని తెలిపారు.

'లోవ'లో అభివృద్ధి పనుల పరిశీలన

తునిరూరల్, మే 8: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో అమలవుతున్న అభివద్ధి పనులను డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు బుధవారం పరిశీలించారు. పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసి కాంట్రాక్టర్లకు సూచనలు ఇచ్చారు. ఆలయ ఈవో విశ్వనాధ రాజు, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం సుభిక్షం

కాకినాడ సిటీ అభ్యర్థి వనమాడి కొండబాబు

కాకినాడ సిటీ, మే 8: వైసీపీ అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విజనరీ లీడర్ చంద్రబాబు కూటమికి అధికారం కట్టబెట్టేందుకు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వనమాడి కొండ బాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం 29వ డివిజనలో ఆయన పర్యటించి కూటమి ప్రభుత్వం అందించే సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థించారు. కొండబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ విధ్వంసకర, అవినీతి, అచారక, డ్రగ్స్ గంజాయి, రౌడీ గుండాల పాలన నుంచి కాకినాడను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అక్రమ సంపాదన కోసం కాకినాడను గంజాయి నగరంగా మార్చి యువత భవిష్యత్తు నాశనం చేశారన్నారు. దేశంలోనే రాష్ట్రం వైసీపీ పాలనలో అభివృద్ధిలో ఆఖరి స్థానం, వినాశనంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి గెలుపు చారిత్రక అవసరం కానుందన్నారు. యువత భవిష్యత్తు, నవ్యాంధ్ర పురోగతికి కూటమి అధికారంలోకి రావడం, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఆవశ్యమని తెలిపారు. పరిశీలకుడు కేతా శ్రీనివాసరావు, డివిజన్ నాయకులు అమలకంటి బలరామ్, పినిశెట్టి శ్రీనివాసరావు, సిరియాల రాము, చింతలపూడి రవి, యాళ్ల రామకృష్ణ, గంజి గోపి, కె.వీర నాగమణి, జి.మంగ దుర్గ పాల్గొన్నారు.





ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు, ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న కొండబాబు



13వ డివిజన్ ప్రచారంలో వనమాడి హేమంత్‌కుమార్



24వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న వనమాడి కుసుమాంజలి

పలు డివిజన్లలో విస్తృతంగా ప్రచారం

పలు డివిజన్లలో అభ్యర్థి వనమాడి కొండబాబు కుటుంబ సభ్యులు, ఆయన సోదరుడు వనమాడి సత్యనారాయణ కుటుంబసభ్యులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. 13వ డివిజన్‌లో వనమాడి హేమంత్‌కుమార్, 8వ డివిజన్‌లో వనమాడి శివప్రసాద్, 21వ డివిజన్‌లో వనమాడి సుష్మారేఖ, 24వ డివిజన్‌లో వనమాడి కుసుమాంజలి విస్తృతంగా ఎన్నికల ప్రచారం సాగించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల కరపత్రాలను పంచుతూ ఓట్లు అభ్యర్థించారు. డమ్మీ బ్యాలెట్ పేపర్‌లను పంపిణీ చేశారు.

కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబును సైకిల్ గుర్తుపైన, కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను గ్లాసు గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుంకర పావని తిరుమలకుమార్ 30వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గ్రంధి బాబ్జి, బచ్చు శేఖర్, అద్దేపల్లి గంగరాజు, దంగేటి సతీష్, బొబ్బిలి గోవిందు, సీమకుర్తి మురళి, కోరుపూడి లలిత, వైకుంఠరావు, శ్రీనివాస్, జనసేన నాయకుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

'జగన్ ప్రభుత్వాన్ని ఓడించాలి'

కాకినాడ సిటీ, మే 8: దళితులకు మేనమామనని చెప్పుకుంటూ వారిపై హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకోని సీఎం జగన్‌ను, వైసీపీ ప్రభుత్వాన్ని చిత్తు, చిత్తుగా ఓడించాలని దళిత నేతలు పిలుపునిచ్చారు. కాకినాడ సూర్యకళామందిరంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో బుధవారం దళితుల ఆత్మగౌరవసభను నిర్వహించారు. జనసేన కాకినాడ పార్లమెంట్ ప్రచార కమిటీ సభ్యుడు టీవీ రామారావు మాట్లాడుతూ అధికార వైసీపీ ప్రభుత్వంలో దళితులపై దాడులు బాగా పెరిగిపోయాయన్నారు. కాకినాడలో దళిత యువకులకు గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను అలవాటు చేసి బానిసలుగా మార్చిన సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడిని, వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించాలన్నారు. సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సబ్బతి ఫణీశ్వరరావు, వల్లూరి సత్తిబాబు, బచ్చల కామేశ్వరరావు, పిల్లి శివ, ఏడిద శివ, బోడపాటి కాంతం పాల్గొన్నారు.

'ఆరోపణలకు సమాధానం చెప్పాలి'

కాకినాడ సిటీ, మే 8: వైసీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌పై తాను చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి కిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానికంగా ఓ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. సునీల్ చేసే వ్యాపారాలు ఏమిటని ప్రశ్నించానన్నారు. ప్రత్తిపాడు పరిసరాల్లో మైనింగ్ అక్రమ రవాణా చేస్తూ ప్రభుత్వ ఖజానాకు చెల్లించాల్సిన సొమ్ము ఎగ్గొడుతున్నారని తాను చేసిన ఆరోపణలపై సునీల్ స్పందించకపోతే వాస్తవమని భావించాల్సి వస్తుందన్నారు. సునీల్ చేస్తున్న అక్రమ వ్యాపారాల వివరాలు, వాటికి సంబంధించిన ఆధారాలు తనవద్ద ఉన్నాయన్నారు. సునీల్ చేస్తున్న మైనింగ్ అక్రమ రవాణా బిల్లులను జనసేన అధికార ప్రతినిధి దాసరి కిరణ్ చూపించారు.

ముగిసిన వేగుళ్లమ్మ జాతర

గొల్లప్రోలు రూరల్, మే 8: దుర్గాడ గ్రామదేవత వేగుళ్లమ్మ జాతర మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. తీన్‌మార్ డ్యాన్సులు, గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, ఉమారామ లింగేశ్వర కోలాట బృందం కోలాటం ఆకట్టుకున్నాయి. డీసీసీబీ సీఈవో దాట్ల వెంకట సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

కాపులను మోసం చేసిన జగన్

జేఏసీ కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు

పెద్దాపురం, మే 8: కాపులను మోసం చేసిన నాయకుడు ముఖ్యమంత్రి జగన్ అని కాపు జేఏసీ కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు అన్నారు. స్థానిక సుధా కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ముద్రగడకు కాపు జేఏసీకి ఎటువంటి సంబంధం లేదని, ముద్రగడ సొంతంగా ముందుకు వెళ్తున్నారని.. ఆయనకు కాపులకు సంబంధం లేదన్నారు. కేవలం ఆయన వ్యక్తిగత నిర్ణయాలతో పోరాటం సాగిస్తున్నారన్నారు. కాపు జేఏసీ సామాజిక వర్గ ప్రయోజనాలకే పనిచేస్తుందన్నారు. ఎన్నికల్లో కాపుల మద్దతు టీడీపీ కూటమికే అని తెలిపారు. చంద్రబాబు కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తే జగన్ రద్దు చేశారన్నారు. పెద్దాపురం అభ్యర్థిగా పోటీ చేస్తున్న నిమ్మకాయల చినరాజప్పకే తమ మద్దతు అని ప్రకటించారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీని ఓడించాలి'

కిర్లంపూడి, మే 8: కాపులకు వెన్నుపోటు పొడిచిన వైసీపీని ఓడించాలని కాపు నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బూరుగుపూడి గ్రామంలో మాజీ ఎంపీటీసీ పాటంశెట్టి రవి స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కాపు జేఏసీ నాయకుడు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు మాట్లాడుతూ కాపు జేఏసీ నాయకత్వంలో ఉద్యమం చేసి సాధించుకున్న ఫలాలు నేడు కాపు కులాలకు అందకుండా పోతున్నాయన్నారు. ప్రధాన మోదీ కాపులకు బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనేనని పార్లమెంటు సాక్షిగా చెప్పినా జగన్ ప్రభుత్వం ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఆలోచించి ఓటేయాలని ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కాపు రాష్ట్ర జేఏసీ నాయకులు ఆరేటి ప్రకాష్, వేమన శ్రీనివాసరావు, ములగాల శ్రీనివాసరావు, సిద్ద నూకరాజు, సురేష్‌నాయుడు, కూరాకుల చినబాబు, త్రినాధరావు, తిరుమల రావు, బావిశెట్టి ప్రసాద్, యర్రంశెట్టి సాయిబాబు, గోపిశెట్టి రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

'రావణ రాజ్యం పోవాలంటే సైకిల్‌గుర్తుకు ఓటు వేయండి'



ప్రచారంలో సుభాష్‌కు హారతులిస్తున్న మహిళలు

కాజులూరు, మే 8: రావణ రాజ్యం పోవాలంటే సైకిల్‌గుర్తు కు ఓటు వేయాలని రామచంద్రపునం కూటమి అభ్యర్థి వా సంశెట్టి సుభాష్ కోరారు. మండలంలోని దుగ్గుదూరు, కాజులూరు, శీల గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్, మోదీలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల మద్దతు కూటమికి ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, బీజేపీ ఇన్‌చార్జి దూడల శంకరనారాయణ, టీడీ పీ మండలాధ్యక్షులు పేపకాయల బాబ్జి, మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణారావు, సర్పంచ్ టి.వెంకటలక్ష్మి జ్యోతికుమార్, కోమలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అధికారంలోకి రాగానే మహిళలకు పెద్ద పీట

జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట/కిర్లంపూడి, మే 8: కూటమి అధికారంలోకి రాగానే మహిళలకు పెద్ద పీట వేస్తామని జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూ తెలిపారు. బుధవారం మండే ఎండను సైతం లెక్క చేయకుండా నెహ్రూ చైతన్య రథంపై కిర్లంపూడి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమవరం గ్రామంలో ప్రారంభించి కృష్ణవరం చేరుకున్న నెహ్రూకు అధిక సంఖ్యలో మహిళలు నీరాజనాలు పలికారు. బూరుగుపూడి, సోమరాయణంపేట, పాలెం, గోనెడ, తాడరాడ, శృంగరాయునిపాలెం, ఎస్.తిమ్మాపురం, భూపాలపట్నం, గెద్దనాపల్లి, వేలంక గ్రామాల్లో బైక్ ర్యాలీ చేశారు. నెహ్రూతో పాటు కాపు జేఏసీ నాయకులు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, ఆరేటి ప్రకాష్, జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నెహ్రూకు మహిళలు హారతులు పట్టారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలకు మంచి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో తనను సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి ఉదయ శ్రీనివాస్‌కు గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో మాజీ జడ్పీ ప్రతిపక్ష నేత తోట నవీన్, ఎంపీపీ తోట, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, కుంచే తాతాజీ, జంపన సీతారామచంద్ర వర్మ, రవివర్మ, పాటంశెట్టి రవి, నీలం శ్రీను, అల్లు విజయ్‌కుమార్, అనుకుల శ్రీకాంత్, సూతి శ్రీను, గంగిరెడ్ల దొరబాబు, మంచికంటి శ్రీనివాస్, జట్ల సదాసాంబశివరావు, సర్పంచ్‌లు వీరంరెడ్డి కాశీబాబు, పట్టు చంటిబాబు, ఉపసర్పంచ్ బొజ్జపు శ్రీను, కాసులు, తాసు, సూరిశెట్టి వెంకటశివ, గండే కాశీ, చిన కాశీ పాల్గొన్నారు. జగ్గంపేటలో టీడీపీ నాయకులు వేముల కొండ జోగారావు ఇంటి వద్ద జరిగిన సమావేశంలో బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు వేమూరి ఆనందసూర్య, ఆపన్నప్రదీపన, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అర్చక, పురోహిత విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిళ్ళపల్లి అయ్యప్ప, రాష్ట్ర ట్రెజరర్ కలగా ప్రభాకర్, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి, క్రెడిట్ సొసైటీ మాజీ డైరెక్టర్ సోమ సుందరం, చింతా అరుణ్‌కుమార్, సీ.ప్రసాద్, జగ్గంపేట బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి గురాజాపు సోమసుందరం, ట్రెజరర్ కూచిమంచి రవి, ముత్య శ్రీనివాస్, కాల్నా ధభట్ల నరసింహమూర్తి, క్రాంతి, విజయలక్ష్మి తదితర బ్రాహ్మణ సభ్యులు పాల్గొని జ్యోతుల నెహ్రూ, ఉదయ శ్రీనివాస్‌కు గెలిపించడానికి బ్రాహ్మణులంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.



బూరుగుపూడి ప్రచారంలో మాట్లాడుతున్న నెహ్రూ



ప్రచారంలో నెహ్రూకు తిలకం దిద్దుతున్న మహిళ

నెహ్రూను కలిసిన కాపు జేఏసీ నాయకులు

జ్యోతుల నెహ్రూని రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాపు రాష్ట్ర జేఏసీ నాయకులు ఆరేటి ప్రకాష్, వాసిరెడ్డి ఏసుదాసు, వేమన శ్రీనివాస్, ములగాల శ్రీనివాసరావు, సిద్ద నూకరాజు, సురేష్ నాయుడు, కూరాకుల చినబాబు, త్రినాధరావు, తిరుమల రావు, బావిశెట్టి ప్రసాద్, యర్రంశెట్టి సాయిబాబు ఉన్నారు.



నెహ్రూను సత్కరిస్తున్న కాపు నాయకులు

సమస్యలు పరిష్కరిస్తా : యనమల దివ్య





తొండంగి మండలం ఏవినగరంలో ప్రచారం నిర్వహిస్తున్న దివ్య, దివ్యకు తిలకం దిద్దుతున్న మహిళలు

తొండంగి, మే 8: ఏవినగరం గ్రామ ఆడపడుచుగా పోటీలో ఉన్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, తన తండ్రిని ఆదరించిన రీతిలో తనకు సహకరించి భారీ మెజార్టీ అందించాలని తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య కోరారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్వగ్రామమైన ఏవినగరంలో యనమల దివ్య బుధవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆమెపై గ్రామస్తులు ప్రజలు పూల వర్షం కురిపిస్తూ బాణసంచాకాలుస్తూ బాజాభజంత్రీలతో గ్రామంలోకి తోడ్కొని వెళ్లారు. ఇంటింటా తిలకం దిద్ది మంగళ హారతులతో స్వాగతం పలికారు. దివ్య మాట్లాడుతూ గ్రామ సమస్యలు పరిష్కరించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానన్నారు. యువకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పించడంతోపాటు యువతులకు అవసరమైన నర్సింగ్ కాలేజీ, మహిళా కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. యనమల నాగేశ్వరరావు, యనమల రాజేష్,యనమల కృష్ణ, కొయ్యా శ్రీనుబాబు, చొక్కా అప్పారావు,పిర్ల శివ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధికి ప్రాధాన్యం'

రాష్ట్రంలో కూటమి గెలుపుతో అభివృద్ధి, సంక్షేమాలకు అధిక ప్రాధాన్యమిచ్చి రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. ఆయన గోపాలపట్నం, ఏకొత్తపల్లి, శృంగవృక్షం గ్రామాల్లో కూటమి నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలంటే చంద్రబాబు వల్లే సాధ్యమవుతుందన్నారు. తొండంగి మండల ప్రజలు తన కుమార్తె దివ్యకు భారీ మెజార్టీ అందించాలని కోరారు. ఆయన వెంట మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, యనమల రాజేష్, కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, బంటుపల్లి అన్వేష్, బెండపూడి నాయుడు, వెలుగుల గోపాలకృష్ణ, సాధనాల నూకరాజు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

తునిరూరల్: తేటగుంట టీడీపీ కార్యాలయంలో శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు సమక్షంలో తేటగుంట శివారు రెల్లిపేట, గవరపేట, తొండంగి మండలం కొత్త పెరుమాళ్ళపురం, తుని నుంచి పలువురు టీడీపీలో చేరారు. తుని కూటమి అభ్యర్థి యనమల దివ్యకు సైకిల్ గుర్తుపైన, జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్లకు గాజుగ్లాసు గుర్తుపైన ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. టీడీపీ నేత యనమల రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, గజ్జి రాంబాబు, జెక్కాన రామునాయుడు పాల్గొన్నారు.



తొండంగి: గోపాలపట్నంలో ప్రచారం నిర్వహిస్తున్న యనమల

కూటమి అధికారంలోకి రావడం ఖాయం

కాకినాడ రూరల్ అభ్యర్థి పంతం నానాజీ



కరపలో ప్రచారం చేస్తున్న పంతం నానాజీ



పేపకాయలపాలెంలో నానాజీని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

కరప, మే 8: కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, ప్రధాని మోడీ సహకారంతో డబుల్ ఇంజన్‌లా దూసుకెళ్లి రాష్ట్ర పురోభివృద్ధికి పాటుపడతామని కాకినాడ రూరల్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ పేర్కొన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం కరప, రామకంచిరాజునగర్‌కాలనీ, పేపకాయలపాలెం, సిరిపురం, జి.బావారం, కూరాడ గ్రామాల్లో నానాజీ విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోతోనే తమకు అధికారం ఖాయమైపోయిందన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటుతో రాష్ట్రం అన్ని రంగాల్లో విప్లవాత్మకమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వ తుగ్లక్ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని, ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఎంపీగా తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యేగా తనను గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పేపకాయలపాలెంలో ఐటీ ఉద్యోగుల బృందం నానాజీకి మద్దతుగా ప్రచారం చేశారు. రామకంచిరాజునగర్‌కాలనీ, పెద్దాపురప్పాడు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు జనసేనలో చేరగా వారందరికీ నానాజీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయా గ్రామాల్లో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, బోగిరెడ్డి కొండబాబు, బోగిరెడ్డి గంగాధర్, బండారు మురళి, పెంకే శ్రీనివాసబాబా, మద్దూరి స్వామి, కాకర్ల బుజ్జిబాబుచౌదరి, దేవు జమిందారు, యాళ్ల పండు, బిరుదా బాబు, పేపకాయల సత్తిబాబు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

సర్పవరం జంక్షన్, మే 8: కాకినాడ రూరల్ మండలం ఏకలవ్య ఎరుకుల సేవా సంఘం అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో సుమారు 50 మంది సభ్యులు బుధవారం గొడారిగుంటలో పంతం నానాజీ సమక్షంలో పార్టీలో చేరారు. నానాజీ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే వివాహాది, శుభకార్యాల నిర్వహణ కోసం అన్ని సదుపాయాలతో కమ్యూనిటీ భవనం నిర్మిస్తామన్నారు. జిల్లా నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మాచవరపు సత్యనారాయణ, బీసీ నాయకుడు పాలిక రమణ పాల్గొన్నారు. తమ్మవరంలో కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి పంతం నా నాజీ, ఎంపీ అభ్యర్థి ఉదయ శ్రీనివాస్ తరఫున మాజీ ఎమ్మె ల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి ప్రచారం నిర్వహించి గాజు గ్లాసు గుర్తుకే ఓట్లేసి గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు రాందేవు సీతయ్యదొర, బొజ్జ భవానిసాంబశివరావు, పలివెల గాయత్రి, గొల్లపల్లి రమణ తదితరులున్నారు.



సర్పవరం జంక్షన్: జనసేనలో చేరినవారితో నానాజీ

'కూటమికి ఓటు వేయండి'

తునిరూరల్, మే 8: ప్రశాంతమైన తుని కోసం కూటమి ప్రభుత్వానికి ఓటు వేయాలని మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత రాజా అశోక్‌బాబు కోరారు. 12వ వార్డు తారకరామారావు కాలనీలో ఆయన కూటమి అభ్యర్థుల తరుఫున ప్రచారం చేపట్టారు. వైసీపీ అరాచక పాలనకు స్వస్తి చెప్పాలని.. కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ఇనుగంటి సత్యనారాయణ, సిద్ధాంతపు సత్తిబాబు, కుసుమంచి శోభారాణి, సత్యనారాయణ,అల్లు రాజు ఉన్నారు.

టీడీపీలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు మండలంలోని వి.కొత్తూరు, ఎన్. సూరవరం, కొలిమేరు, హంసవరం గ్రామాల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా పార్టీ శ్రేణులతో ప్రచారం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు చింతమనీడి నాగ సోమ రాజు, నరేష్, శ్రీను, ఆవుగంటి వెంకటరమణ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

తాళ్లరేవు, మే 8: వైసీపీ మండల మాజీ కన్వీనర్ దడాల బుజ్జిబాబు, మాజీ ఎంపీటీసీ మేకల గోపాలకృష్ణ వైసీపీ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. బుధవారం వారికి ముమ్మిడివరం టీడీపీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

కాంగ్రెస్ ప్రచారం

గండేపల్లి, మే 8: మండలంలోని మురారి, గండేపల్లి, రామయ్యమ్మపాలెం, సింగరంపాలెం, మల్లేపల్లి, నీలాద్రిరావుపేట, రాగంపేట గ్రామాల్లో కాంగ్రెస్ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి మరోతి శివగణేష్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని అభ్య ర్థించారు. శ్రీవత్సవాయి సత్యనారాయణరాజు, డాక్టర్ నక్క సత్యనారాయణ, చంద్రమౌళి వెంకటరత్నం, బాపిరాజు ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

జగ్గంపేట, మే 8: మండలంలోని రామవరం గ్రామ శివారున హరియాణా దాబా ఎదురుగా బుధవారం రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ధర్మవరానికి చెందిన తండ్రీ కొడుకులు బైక్ వెళ్తుండగా రామవరం వచ్చేసరికి ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బండి నడుపుతున్న వ్యక్తి కిందపడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఇంకా కేసు నమోదు కాలేదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయం

తాళ్లరేవు, మే 8: తాళ్లరేవు ముత్యాలమ్మగుడి వద్ద రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయమైంది. యానాం ప్రాంతం దొమ్మేటివారిపేటకు చెందిన రంగాల విజయకుమార్, పితాని యేసురత్నం ద్విచక్రవాహనంపై తాళ్లరేవు నుంచి ఇంటికి వెళ్తుండగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ గన్‌మేన్ పలివెల సురేష్ ద్విచక్రవాహనంపై వేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో రంగాల విజయకుమార్‌కు తీవ్రగాయం కాగా యేసురత్నం, గన్‌మేన్‌లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రశాంతంగా ఏపీఈసెట్-2024

కాకినాడ రూరల్, మే 8: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఏపీఈసెట్-2024 ప్రవేశపరీక్షను అనంతపురం జేఎన్టీయూఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పరీక్షను కాకినాడ జిల్లాలో 5 కేంద్రాల్లో 2 సెషన్‌లలో నిర్వహించగా మొత్తం 2140 మంది విద్యార్థులకు 2094 మంది హాజరయ్యారని కన్వీనర్ ప్రొఫెసర్ భానుమూర్తి తెలిపారు. కాకినాడ ఐయాన్ డిజిటల్ జోన్, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల, ఆదిత్య సూరంపాలెం క్యాంపస్‌లోని 3 కేంద్రాల్లోనూ ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకూ ఆన్‌లైన్‌లో పరీక్షలు జరిగాయన్నారు. మొదటి సెషన్‌లో 1071 మందికి 1037 మంది, రెండో సెషన్‌లో 1069 మందికి 1057 మంది హాజరుకాగా మొదటి సెషన్‌కి 97 శాతం, రెండో సెషన్‌కి 99శాతం హాజరు నమోదైందన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

కాకినాడ సిటీ, మే 8: పెదపూడి మండలం పెద్దాడలో అనపర్తి కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి సమక్షంలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరగా రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. చేరినవారిలో వైసీపీ నాయకులు పల్లపాటి వెంకన్న, అప్పారావు, పల్లపాటి ఎర్రోడు, పైడిమాళ్ల రామకృష్ణ, పి.మోహన్, వారి అనుచరులు ఉన్నారు.

